క్లుప్తంగా

వివక్ష చూపినందుకే రాజీనామా



తోలు వెంకటయ్య

బొంరాస్‌పేట: బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నామమాత్రపు పదవిలో ఉంచి వివక్ష చూపినందుకే రాజీనామా చేసినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తోలు వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన రాజీనామా పత్రాన్ని పార్టీ మండలాధ్యక్షుడికి సమర్పించినట్లు తెలిపారు. కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా ఎస్సీలకు దళితబంధు పథకం అమలు చేసినా మండల స్థాయి ఎస్సీ సెల్ అధ్యక్షులతో సంప్రదింపులు, సమాలోచనలు లేకుండా మండల నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి వివక్షత చూపారని ఆరోపించారు. పలు కారణాలతో పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశానని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



చంద్రశేఖర్

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని చౌడాపూర్ మండల యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి చేయాలని, యూపీఎస్ విధానంతో కాకుండా ఓపీఎస్ విధానం ద్వారా పెన్షన్లను అందించే విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజలు కోరుకునే పథకాలను ప్రభుత్వాలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బలరాం



కొడంగల్ : కొడంగల్ మున్సిపల్ కమిషనర్‌గా బలరాం నాయక్ బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నార్సింగ్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. కొడంగల్ మున్సిపల్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పూలమాల శాలువతో సత్కరించారు.

నిబంధనలు తప్పనిసరి

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



నిబంధనలపై సూచనలు ఇస్తున్న డీఎస్పీ

పరిగి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వాహనాన్ని నడిపించేటప్పుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందాలని సూచించారు. అలాగే, వాహనానికి సంబంధించి అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలని అన్నారు. పత్రాలు లేకున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనాల ప్రకారం వాహనాలను పడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మద్యం సేవించి నడపడం ద్వారానే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై సంతోష్‌కుమార్, ఆర్టీసీ డీఎం కరుణశ్రీ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న కాంగ్రెస్ నేత



ఆంజనేయస్వామికి టెంకాయలు కొడుతున్న సంగమేశ్వర్

ధారూరు: వికారాబాద్ ఎమ్మెల్యేగా గడ్డం ప్రసాద్‌కుమార్ గెలిస్తే ఆంజనేయస్వామికి 101 కొబ్బరి కాయలు కొడుతానన్న శివమాల ధరించిన ఓ కాంగ్రెస్ నాయకుడు గురువారం తన మొక్కును తీర్చుకున్నారు. మండల కేంద్రానికి చెందిన సంగమేశ్వర్ కుల్కచర్ల మండలం చౌడాపూర్‌లో ఉన్న ఆంజనేయస్వామి మహిమను తెలుసుకుని ప్రసాద్‌కుమార్ వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలిస్తే 101 టెంకాయలు కొడతానని మొక్కడం, అక్కడికి వెళ్లి మొక్కు చెల్లించుకోవడం సంతృప్తినిచ్చిందని సంగమేశ్వర్ తెలిపారు. చాలా మంది భక్తులు వచ్చి ఆంజనేయస్వామికి మొక్కుకుంటారని, అందులో భాగంగా అక్కడికి వెళ్లాలని పేర్కొన్నారు.

పంచాయతీల్లో నిధులు నిల్!

- నిస్తేజంగా మారిన గ్రామాలు
- పారిశుద్ధ్య కార్మికులకు అందని వేతనాలు



డ్రైనేజీలో మురుగు తీస్తున్న పంచాయతీ కార్మికులు

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీల ఖాతాలు నిధులు ఖాళీ అయ్యాయి. సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులకు చేతి నిండా పని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం చేపట్టింది. కానీ పంచాయతీల్లో ఖాతాల్లో నిధులు లేవు. నిధులు జమ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవలే పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు గ్రామపంచాయతీల నుంచి బిల్లులు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం జీపీలకు మంజూరయ్యే నిధులతోనే గ్రామాల్లో పాలన కొనసాగించాలని, ఆదేశాలు వచ్చాకే బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.

వేసవిలో ఎలా..?

గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జీపీల ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉంది. క్రమక్రమంగా ఎండలు మండుతున్నాయి. దీంతో బోర్లు చెడిపోవడంతో పాటు మోటార్లు కాలిపోతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం జీపీల ఖాతాల్లో నిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు కార్మికులకు సైతం రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి జీపీల ఖాతాల్లో నిధులను జమ చేయాలని కార్మికులు, అధికారులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

జిల్లా వ్యాప్తంగా నూతన ఎంపీడీఓలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీడీఓలు ఆయా మండలాలకు బదిలీలపై వెళ్లి బాధ్యతలు చేపట్టారు.

దౌల్తాబాద్ ఎంపీడీఓగా విజయలక్ష్మి



దౌల్తాబాద్: దౌల్తా బాద్ ఎంపీడీఓగా విజయలక్ష్మి నియామకం అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న తిరుమల స్వామి నల్గొండ జిల్లాకు బదిలీ కాగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న విజయలక్ష్మి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి బుధవారం విధుల్లో చేరారు. ఆమెను ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ఎంపీపీ మహిపాల్ రెడ్డి సన్మానించారు..

వికారాబాద్ ఎంపీడీఓగా వినయ్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండల ఎంపీడీఓగా వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన సత్తయ్య సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధారూరు ఎంపీడీఓగా నర్సింహులు



ధారూరు: ఖాళీగా ఉన్న ధారూరు ఎంపీడీఓ స్థానాన్ని భర్తీ చేశారు. నూతన ఎంపీడీఓగా బి. నర్సింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. మహేశ్వరం మండల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్నాళ్లు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వికారాబాద్ మండల పరిషత్ సూపరింటెండెంట్ చెన్నారెడ్డి కొనసాగారు.

కుల్కచర్ల ఎంపీడీఓగా రామకృష్ణనాయక్

కుల్కచర్ల: కుల్కచర్ల మండల నూతన ఎంపీడీఓగా రామకృష్ణనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కుల్కచర్ల మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న నాగవేణి యాదాద్రి భువనగిరికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణనాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

బంట్వారం ఎంపీడీఓగా రాములు

బంట్వారం: బంట్వారం మండల ఎంపీడీఓగా ఎ. రాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రాములు

ఇక్కడ విధులు నిర్వహించిన బాలయ్య సిద్దిపేట జిల్లాకువెళ్లారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. మండల ప్రజలు, ప్రజాప్రతినిధుల సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. అందరూ సమన్వయంతో పని చేస్తేనే సమస్యలు తలెత్తవన్నారు. అనంతరం ఎంపీపీ ప్రభాకర్ నూతన ఎంపీడీఓ రాములును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ షిండే ,జేఏ షఫీ, ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు ఆలంపల్లి శ్రీనివాస్, సిద్దిరాములు స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


దోమ నూతన ఎంపీడీఓగా మహేశ్‌బాబు



దోమ: ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

దోమ: దోమ నూతన ఎంపీడీఓగా హెచ్.మహేశ్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ జయరాం నల్గొండ జిల్లాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మహేశ్ బాబు దోమకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు పంచాయతీ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బషీరాబాద్ ఎంపీడీగా రాఘవులు



కొత్త ఎంపీడీఓ రాఘవులతో మండల అధికారులు

బషీరాబాద్: మండల కొత్త ఎంపీడీఓగా రాఘవులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీఓ రమేష్, మండల అధికారులు కొత్త ఎంపీడీఓను సన్మానించారు.

తాండూరు ఎంపీడీఓగా విశ్వప్రసాద్



బాధ్యతలు చేపట్టిన విశ్వప్రసాద్

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయ నూతన ఎంపీడీఓగా విశ్వప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన సుదర్శన్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి జిల్లా కంది మండల ఎంపీడీఓగా పని చేసిన విశ్వప్రసాద్ తాండూరు మండల ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘన స్వాగతం పలికారు.

పెద్దేముల్ ఎంపీడీఓగా హరీష్‌కుమార్



పెద్దేముల్: పెద్దేముల్ మండల ఎంపీడీఓగా హరీష్ కుమార్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం హరీష్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో పనిచేసిన హరీశ్‌కుమార్ పెద్దేముల్ మండలానికి బదిలీపై రావడం ,పెద్దేముల్ మండలంలో పనిచేసిన లక్ష్మప్పను సిద్దిపేటకు బదిలీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారుల బదిలీలు జరుగనున్నాయి. ఈ క్రమంలో పెద్దేముల్ మండలంలో ఎస్ఐ కాశీనాథ్ స్థానంలో కొత్త ఎస్ఐ హరి నియామకం అయ్యారు. అనంతరం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓకు సన్మానం చేసి స్వాగతం పలికారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న నేతలు

కుల్కచర్ల: మండలంలోని అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చాకల్‌పల్లి తండాలో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సేవాలాల్ సేన జాతీయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌నాయక్ మాట్లాడారు. గిరిజన ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సంత్ సేవాలాల్ మహరాజ్‌ని అన్నారు. సేవాలాల్ సేన కృషితో ఆయన జీవిత చరిత్ర ప్రపంచ వ్యాప్తంగా బహిర్గతమైందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా ఒక పండగలా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కుల్కచర్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, నూన్సవత్ మోహన్, వడిత్య గోపాల్, రవీందర్, ప్రవీణ్, నార్య, ధన్సింగ్, గోబ్రియా, రాములు, రమేష్ పాల్గొన్నారు.

ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కిషన్

చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీగా బి కిషన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల బదిలీలో భాగంగా చేవెళ్ల ఏసీపీగా పనిచేసిన పి. ప్రశాంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఎస్పీ టీఎస్ లెవల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బంటు కిషన్‌ను చేవెళ్ల ఏసీపీగా బదిలీ చేశారు. చేవెళ్లకు వచ్చిన ఆయన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మంలు స్వాగతం పలికారు.

నీటి కష్టాలు రావొద్దు

- వేసవిలో రోజువిడిచి రోజు భగీరథ
- అధికారులు సభ్యుల ముందస్తు ఆలోచనలు
- వేసవిలో నీటి కొరత ఉంటుంది
- సీఎం ఆదేశాలను చదివిన సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు, సభ్యులు

బొంరాస్‌పేట: రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు రావచొచ్చని, పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రధాన సమస్యలు, అంశాలపై అధికారులు, సభ్యులు చర్చించారు. ఎంపీపీ హేమీబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేసవిలో ఎదురయ్యే నీటి కొరత పట్ల ఏఈ రాఘవేందర్ సమక్షంలో చర్చించారు. దీనిపై అందిన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను సమావేశంలో చదివి వినిపించారు. వేసవిలో రోజు విడిచి రోజు గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నందున ఇప్పటినుంచే తగు జాగ్రత్తలు తీసుకోవాలని చర్చించారు. కృష్ణాజలాల సమస్య ఏర్పడనున్న కారణంగా వేసవిలో నియోజకవర్గానికి మిషన్‌భగీరథ సమస్య ఉంటుందన్నారు. ఇప్పటినుంచే తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు సభ్యులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 200 యూనిట్లు ఉచిత కరెంటు మీటరున్నవాళ్లకే అన్నారు. సర్వీస్ నంబరు సేకరణ చేసి లక్ష్యాన్ని చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార భద్రత కార్డులున్న వారిని సర్వే చేసి గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. కొత్త తెల్లరేషన్‌కార్డుల గురించి సభ్యులు ఆడిగిన ప్రశ్నకు ప్రభుత్వ అనుమతితోనే రానున్నట్లు అధికారులు చెప్పారు. దుద్యాల, బొంరాస్‌పేట మండలాలకు సీసీరోడ్లు రూ.7.20కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

నివాళితో ప్రారంభం

పుల్వామా దాడి రోజు కావడంతో పాటు, స్థానిక ఎంపీఓ పాండునాయక్, సీనియర్ అసిస్టెంట్ షరీఫ్, ఉపాధిహామీ పథకం టీఏ కుర్మయ్య, అటెండర్ హేమలత ఇటీవల చనిపోవడంతో నివాళిగా అధికారులు, సభ్యులు మౌనం పాటించి సభను ప్రారంభించారు.

అసైన్‌మెంట్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ : మండలంలోని అప్పాయిపల్లి గ్రామం సర్వే నంబర్ 19లోని అసైన్‌మెంట్ భూములను అధికారులు బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఫిజియోథెరఫి కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వీటి నిర్మాణానికి అవసరమైన భూములను అప్పాయిపల్లిలో పరిశీలించారు. గతంలో పేదలకు ప్రభుత్వం భూములను పంపిణీ చేసింది. ఈ అసైన్‌మెంట్ భూములను తిరిగి ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు పలుమార్లు రైతులతో చర్చించారు. కొంతమంది రైతులు వారి భూములను ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తాండూరు ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌లు గ్రామానికి వెళ్లి భూములను పరిశీలించారు. సాగులో ఉన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందన్నారు. కుటుంబంలో ఒకరికి మెడికల్ కళాశాల లేదా ఆస్పత్రిలో ఉద్యోగం ఇస్తామని అధికారులు చెప్పారు. అర్హతలను బట్టి తగిన ఉద్యోగం ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



తాండూరు టౌన్ : అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దీప



తాండూరు టౌన్ : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అభ్యాస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వసంత పంచమి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పాల్గొన్నారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీప పాల్గొన్నారు. స్థానిక నేతాజీ గురుదేవ్ గురుకుల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ మణిమాల, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు తమ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలపై సరస్వతీ మాత కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ఉంటూ, వారిని విజ్ఞాన వంతులుగా చేయాలని వారు కోరుకున్నారు.

ఘనంగా వేడుకలు

అనంతగిరి: వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం వికారాబాద్‌లోని సరస్వతి శిశు మందిరం ఉన్నత పాఠశాలలో సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. అనంతరం అర్చకులు తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల చేత అక్షరభ్యాసం చేయించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నర్సింలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా..

కుల్కచర్ల: వసంత పంచమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు పాఠశాలల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. బుధవారం మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చిన్నారులతో వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. చదువుతోనే సర్వస్వం సాధ్యమని పలువురు పేర్కొన్నారు.



కుల్కచర్ల: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



అనంతగిరి: అక్షరభ్యాసంలో తల్లిదండ్రులు

పిల్లలకు ఫోన్లు ఇవ్వొద్దు

కౌన్సిలర్ సంగీతా ఠాకూర్



చిన్నారికి విటమిన్ ఏ సిరప్‌ను వేస్తున్న కౌన్సిలర్ సంగీతా ఠాకూర్

తాండూరు టౌన్ : చిన్నారులను మొబైల్ ఫోన్లకు దూరంగా పెట్టాలని పట్టణ మున్సిపల్ 20వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు విటమిన్ ఏ సిరప్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో చిన్న పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు బాగా అలవాటు పడుతున్నారన్నారు. దగ్గరి నుంచి వాటిని చూడటం వల్ల చిన్నారుల కంటి చూపు మందగించే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వరాదన్నారు. 9 నెలల నుంచి ఐదేళ్ల వయసు ఉన్న ప్రతి చిన్నారికి అంగన్‌వాడీ కేంద్రంలో ఉచితంగా విటమిన్ ఏ ను ఇప్పించాలన్నారు. దీని వల్ల పిల్లల కంటి చూపు మెరుగవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి, ఆశవర్కర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆయమ్మ అనిత, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మలుపు



యూ ఆకారంలో కొత్తపల్లి మలుపు రోడ్డు

పట్టించుకోని అధికారులు

బంట్వారం: మలుపు రోడ్లు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌కు వెళ్లే ఈ రహదారిలో రెండు చోట్ల మలుపు ఉన్నాయి. ఒక చోట పూర్తిగా యూ ఆకారంలో ఉండగా మరో చోట చెరువు దగ్గర మూల మలుపు మరీ ప్రమాదకరంగా కనిపిస్తుంది. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు అసలే కనిపించవు. దూరం నుంచి హరన్ మోగిస్తే కాని వాహనాలు వచ్చేది కనిపించని పరిస్థితి. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. చెరువు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంచెలు ,పొదలు దగ్గరగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. మలుపు రోడ్లు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు అసలే పట్టించుకోవడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు పేర్కొంటున్నారు.

గడువులో రాయితీ చలాన్లు చెల్లించాలి

ఎస్ఐ గిరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ గిరి

పెద్దేముల్: ప్రభుత్వం వాహనాలపై ఇచ్చిన రాయితీని గడువులోగా చెల్లించి పోలీసులకు సహకరించాలని పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంలో తాండూరు-సంగారెడ్డి మార్గంలో పలు వాహనాలను తనిఖీలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ ప్రకారం గడువులోగా చెల్లించక పోతే మళ్లీ జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెంట్లు తప్పకుండా వాడాలని సూచించారు. ఆటోలు, జీపులు ఇష్టం వచ్చినట్లు రోడ్లపై నిలిపి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాల ప్రారంభం, వదిలే సమయంలో విద్యార్థులను చూసి వాహనాలు నడుపాలన్నారు.